క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే భూపతిరెడ్డిని తననివాసంలో కలిశారు. గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వాగుపై చెక్‌డ్యాం, హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడు బుచ్చన్న, శ్రీధర్, జగన్, కిషోర్‌గౌడ్, మహేష్‌గౌడ్, నర్సయ్య, మోహన్, సాయిలు, ప్రసాద్‌గౌడ్, సన్నీ, చంద్రాగౌడ్‌లు కలిశారు.

ముగిసిన వరుణ యాగం



సిరికొండ : మండలకేంద్రంలో గల లొంక రామలింగేశ్వర స్వామి ఆలయంలో వర్షాలు కురిపించాలని గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న వరుణయాగం ఆదివారంతో ముగిసింది. యాగంలో భాగంగా ఆలయంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు పూజలు చేశారు. పురోహితులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలను పఠిస్తూ భక్తులు యాగంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సత్రం నిర్వహించారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి



సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాయాగౌడ్, నర్సాగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, ఆనంద్ గౌడ్, వినోద్‌గౌడ్, యూత్ సభ్యులు వంశీగౌడ్, సురేష్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్, జగదీష్‌గౌడ్, రంజిత్‌గౌడ్, సిద్దుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థులకు న్యాయం చేయాలి



పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల జరిగిన మొదటి విడత బీఈడీ కౌన్సిలింగ్‌లో అధికారులు సంబంధం లేని ప్రశ్నలతో ఆదివాసీ నాయకపోడు విద్యార్థులకు అన్యాయం చేశారని ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, ఉద్యోగ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్ ఆరోపించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిదిలోని పెర్కిట్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ బీఈడీ కౌన్సిలింగ్‌లో ఆదివాసీ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై త్వరలో హైదరాబాద్‌లోని ట్రిబల్ వెల్ఫేర్ కమిషనర్, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలవనున్నట్లు వెల్లడించారు. ఆదివాసీ విద్యార్థులకు న్యాయం చేయకపోతే త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101,600	వెండి(కిలో)	1,21,000
22 క్యారెట్స్	93,795	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	48	గాజరుగడ్డ	30	60
బెండకాయ	25	50	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	25	50	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	50	90	గోబిగడ్డ	10	20
కాకరకాయ	20	40	గోబిపువ్వు	30	60
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	40	80	కరివేపాకు	40	80
మెంతికూర	50	90	చామగడ్డ	40	80
కొత్తిమీర	40	80	చిక్కుడుకాయ	30	60
పుదీనా	40	80	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	20	40			

-సుభాష్‌నగర్

అధ్వానంగా ఆర్యనగర్ రోడ్లు

- గుంతలమయమైన అంతర్గత రోడ్లు
- నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు
- పట్టించుకోని బల్దియా అధికారులు



ఆర్యనగర్ లోపలికి వచ్చే రోడ్డు మొదట్లోనే ఏర్పడిన గుంతలు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే గుంతలమయమైన రోడ్లలో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదో డివిజన్‌పరిధిలోని ఆర్యనగర్‌రోడ్లతో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. బల్దియా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ధ్వంసమైన రోడ్లు

ఆర్యనగర్‌లో అడుగడుగునా గుంతలు ఉన్న రోడ్లు దర్శనమిస్తున్నాయి. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు ధ్వంసం అయ్యాయి. కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేయడంతో సీసీ రోడ్లు పాడయ్యాయి. ఉప్పర్‌మల్లయ్య పెట్రోల్ బంక్ నుంచి ఈగ సంజీవ్‌రెడ్డి ఇంటి వరకు దాదాపు రెండు కిలోమీటర్ల రోడ్డు మొత్తం పాడైపోయింది. హనుమాన్ ఆలయం ముందు రోడ్డు వర్షపు నీటితో నిండిపోయింది. గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షపు నీరు నిలిచిపోయింది. వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. పాదాచారులకు సైతం నడవడానికి వీలుకావడం లేదు. దాంతో ప్రత్యామ్నాయ గల్లీల గుండా వెళుతున్నారు.

నిర్మించని సీసీ డ్రైన్లు..

ఆర్యనగర్ నుంచి సంజీవ్‌రెడ్డి కాలనీవరకు ఉన్న ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉండాల్సిన సీసీ డ్రైన్లు నిర్మించలేదు. దాంతో వర్షపు నీరు మొత్తం రోడ్డుమీదనే నిలిచిపోతుంది. పల్లపు దిశగా నీరు ఖాళీ ప్లాట్లోకి వెళ్లి చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. దాంతో రోడ్డుపై రోజులుగా వర్షపు నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

వందల వాహనాలు..

ఆర్యనగర్‌కు ఆనుకుని సమీపంలో దాదాపు 12 కాలనీలు ఉన్నాయి. ఈ మార్గం గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. నిధులు భారీగా అవసరమైనందున బల్దియా పనులు చేపట్టలేదు. ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదు.

కమిషనర్‌తో మొర..

స్థానికులు పలుమార్లు బల్దియా కమిషనర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. రోడ్లు బాగుచేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కావడం లేదు. కనీసం చిన్న చిన్న పాచ్ వర్కులు కూడా చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గుంతలో పడిపోయాను



ప్రధాన రోడ్డు నుంచి సంజీవ్‌రెడ్డి ఇంటికి వెళ్తుంటే రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది.ఈ రోడ్డు గుండా రావాలంటే చాలా ఇబ్బందిగా మారింది. రెండుసార్లు గుంతలో పడిపోయాను. బల్దియా ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. కనీసం మరమ్మతులు చేపట్టాలి.

– అమర్‌సింగ్, కాలనీవాసి

మరమ్మతులు చేయడం లేదు



ఆర్యనగర్ కాలనీలో జనాభా ఆరువేల వరకు ఉంటుంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు. కాలనీవాసులం పలుమార్లు బల్దియా అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పనులు ప్రారంభించడం లేదు. చిన్నపిల్లలు గుంతల్లో పడిపోతున్నారు.

– విజయ్, టెలిఫోన్ కాలనీ



గుంతల రోడ్డు నుంచి వస్తున్న వాహనదారుడు



రోడ్డు మధ్యలో గుంతలు, నిలిచిన వర్షపు నీరు

35 తండాలకు బస్సు సౌకర్యం కరువు

- రూరల్ నియోజకవర్గంలో బస్సులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ప్రధాన కేంద్రాలకు చేరాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కు

ఇందల్వాయి: రూరల్ నియోజకవర్గంలో ఇందల్వాయి,దర్పల్లి, సిరికొండ మండలాల్లో 35 గిరిజన తండాలకి ఇప్పటికి బస్సు సౌకర్యం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యానికి గిరిజన మహిళలు దూరమవుతున్నారు. తండాల నుంచి బస్సు వచ్చే చోటికి వెళ్లాలంటే వారు ఇప్పటికీ ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న మారుమూల ప్రాంతాలకు ప్రభుత్వ ప్రజా రవాణ వ్యవస్థ సేవలు అందకపోవడం విచారకరం.



ఆర్టీసీ బస్సు

బస్సులు రాని తండాలు

- ఇందల్వాయి మండలంలో : ఇందల్వాయి తండా, జీకే తండా, త్రయంబక్‌పేట్ తండా, గండితండా, కే.కే తండా, రాంసాగర్ తండా.
- ధర్పల్లి మండలంలో : డీబీ తండా, బెల్యాతండా, మరియా తండా,ఇందిరానగర్ తండా,సల్పబండ తండా,గుడి తండా,రేకులపల్లి తండా,నడిపితండా.
- సిరికొండ మండలంలో : వర్దన్‌తండా,సుభాష్ తండా, నాప్ప తండా,రామ్‌సింగ్ తండా, దూప్య తండా,చౌక్లనాయక్ తండా, పీసరగుట్ట తండా, పోతున్నార్ తండా, మహిపాల్ తండా, లొంక తండా, సర్పంచ్ తండా, గడ్డమీద తండా, మెట్టుమర్రి తండా, బుగ్గ తండా, గంట తండా, రూప్‌సింగ్ తండా, జగదాంబ తండా, జంగిలోడి తండా,కర్దులపేట్ తండా.

గిరిజన తండాలకు బస్సు సౌకర్యం కల్పించాలి



మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజన తండాలకు ప్రభుత్వం బస్సు సౌకర్యం కల్పించాలి. సరైన రవాణ సౌకర్యం లేక గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. మహాలక్ష్మి పథకం పూర్తి స్థాయిలో గిరిజన మహిళలకు అందడం లేదు. తండాల నుంచి ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకర ప్రయాణాలు సాగించాల్సి రావడం విచారకరం. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని తండాలకి బస్సు సౌకర్యం కల్పించాలి.

– రామవత్ మోహన్ నాయక్, మాజీ సర్పంచ్ జీ.కే తండా

ఎమ్మెల్యే సిఫార్సు చేస్తే బస్సు సౌకర్యం కల్పిస్తాం

బస్సు సౌకర్యం లేని గిరిజన తండావాసులు స్థానిక ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం అందించి సిఫార్సు లేటర్‌ని ఆర్టీసీ డీఎంకి పంపితే బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం. ఏ తండాకి ఏ సమయంలో బస్సు పంపితే ప్రయాణికులకు, ఆర్టీసీకి అనుకూలంగా ఉందో పరిశీలించి గిరిజన తండాలకి ఆర్టీసీ బస్సులు నడిపే ఏర్పాట్లు చేస్తాం.

– ఆనంద్, నిజామాబాద్ డిపో–1 మేనేజర్

రామమందిర నిర్మాణంలో వీహెచ్‌పీ కీలక పాత్ర



మాట్లాడుతున్న కంచర్ల వెంకటరమణ



బహుమతులు అందిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

నిజామాబాద్ రూరల్: అయోధ్య రామమందిర నిర్మాణంలో వీహెచ్‌పీ కీలక పాత్ర పోషించిందని కంచర్ల గోపన్న ముని మనవడు కంచర్ల వెంకటరమణ అన్నారు. నగరంలోని కోటగల్లిలో నల్లహనుమాన్ మందిరంలో విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్ స్థాపించి 61వ ఏటాలోకి అడుగుపెడుతుందన్న సందర్భంగా హిందువులకు శుభాకాంక్షలు తెలిపారు. 1964లో కృష్ణాష్టమి రోజున వీహెచ్‌పీని స్థాపించరని అన్నారు. శ్రీకృష్ణాజన్మష్టమి పురస్కరించుకొని చిన్నారులకు రాధాకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ఠాకూర్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, ఉపాధ్యక్షులు ఆనంద్, సహా కార్యదర్శి ధాత్రిక రమేశ్, రాంప్రసాద్ చట్టర్జీ, బాసొల్లా నీకేష్, తేలు శేఖర్, ఇందూరు సురేష్, రాజేశ్వర్, యశ్వంత్, సతీష్, గణేష్ , సంపత్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ గ్రామీణ కర్మచారి సంఘ్ కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్ రూరల్: నగరంలోని ఆర్ఎస్ఎస్ భవన్‌లో ఆదివారం భారతీయ గ్రామీణ కర్మచారి సంఘ్ డివిజన్ మొదటిమహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ గ్రూప్ తెలంగాణ కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.చంద్రశేఖర్, కార్యదర్శి కె.వేణుగోపాల్, కోశాధికారిగా దేవరాజులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీఎంఎస్ గ్రూప్ ప్రతినిధులు కిశోర్, లింబాద్రి, శ్రీనివాస్, సాయిరెడ్డి, వినయ్‌సుధీర్, స్వామికుమార్‌లు పాల్గొన్నారు.



ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

మూఢ నమ్మకాలను వీడాలి

నిజామాబాద్ రూరల్: మూఢ నమ్మకాలను వీడాలని పౌర హక్కుల సంఘం, జనవిజ్ఞాన వేదిక, సంయుక్త నిజనిర్ధారణ కమిటీ సభ్యులు అన్నారు. మోపాల్ మండలంలోని సింగంపల్లి గ్రామంలో ఈనెల 12న మంత్రాల నెపంతో మహిళను చెట్టు కట్టేసిన ఘటన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని వారు ఆదివారం పరామర్శించారు. ఈఘటనలో నేరస్తులకు శిక్షపడేలా సాంకేతిక ఆధారాలను సేకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్గోట్ రవీందర్, జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి నర్రా రామారావు, జిల్లా నాయకులు పోతే ప్రవీణ్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కర్నాటి సంధ్యారాణి, రైతు కూలీ సంఘం నాయకులు నారాయణ, గంగారాం, అరుణోదయ జిల్లా నాయకులు గాజుల గంగారాం పాల్గొన్నారు.



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

గ్రామీణ వైద్యులు ఐక్యంగా ఉండాలి

నిజామాబాద్ నాగారం: గ్రామీణ వైద్యులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్గం మోహన్ అన్నారు.హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామీణ వైద్యుడు తన పరిధిలోనే వైద్య సేవలు అందించాలని సూచించారు. గ్రామీణ వైద్యులు రోగులకు ఇచ్చే ఔషధాల విషయంలో, ముఖ్యంగా స్టెరాయిడ్స్ వంటి మందుల వాడకంపై స్పష్టత, నియంత్రణ ఉండాలని ఆయన హితవు పలికారు.



మాట్లాడుతున్న పుల్గం మోహన్

ఘనంగా గోపాల కాల్వలు



నృత్యం చేస్తున్న యువకులు

సిరికొండ : మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా గోపాల కాలువలను ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. లంక రామలింగేశ్వర స్వామి ఆలయంలో గత వారం రోజులుగా సప్త భజన నిర్వహించారు. ఉట్టి కొట్టడానికి యువకులు పోటీపడ్డారు. ఉట్టి కొట్టిన యువకులు కేరింతలతో నృత్యాలు చేశారు. వారిని గ్రామస్తుల అభినందించారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథులు

- కొనుగోలు చేసేందుకు వస్తున్న యువజన సంఘాలు
- 27న వినాయక చవితి



కొనుగోలు చేయడానికి వచ్చిన యువకులు



పెర్కిట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

ఆర్మూర్ టౌన్: దేశంలో వైభవంగా జరుపుకునే పండుగలలో వినాయక చవితి ఒకటి. ఈ పండుగకు చిన్నారులు, యువత, యువజన సంఘాలు, కాల నీ అభివృద్ధి కమిటీలు తమ కాలనీల్లో గణపతి వి గ్రహాన్ని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించటం ఆనవాయితీగా మా రింది. ఈ నెల 27 వినాయక చవితి పండుగ ప్రారంభం కానుంది.

జోరుగా విగ్రహాల తయారీ

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో 12మంది కళాకారులు వినాయక విగ్రహాల తయారీలో బిజీగా ఉన్నారు. రాజస్తాన్ నుంచి వచ్చిన కళాకారులు రూ.500 నుంచి రూ. 50,000 వరకు ధరలు గల విభిన్న పరిమాణాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు. మట్టి గణపతి విగ్రహాలు ధరలు రూ.1,000 నుంచి రూ. 15వేల వరకు ఉన్నాయి.చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరికీ ఆకట్టుకునే విధంగా విగ్రహాల రూపకల్పన చేశారు. మరికొందరు నాందేడ్, మహారాష్ట్ర నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు.

పర్యావరణానికి ప్రాధాన్యత..

పర్యావరణ పరిరక్షణ కోణంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మట్టి గణపతిని ప్రోత్సహిస్తున్నాయి. ఈ ప్రభావంతో చాలామంది పీవోపీ విగ్రహాల కంటే మట్టివిగ్రహాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.

పెరిగిన ధరలు

ఈ సంవత్సరం ముడి సరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు కూడా స్వల్పంగా పెరిగినట్టు కళాకారులు తెలిపారు. చాలా మంది భక్తులు ఇప్పటికే అడ్వాన్స్ చెల్లించి తమ విగ్రహాలను బుక్ చేసుకుంటున్నారు.

15 ఏళ్ల నుంచి తయారు చేస్తున్నాం



రాజస్థాన్ నుంచి వచ్చిన మేము గత 15 సంవత్సరాల నుంచి వినాయక విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నాం. రూ. 500 నుంచి రూ.50 వేల వరకు ధరలు గల గణపతి విగ్రహాలు ఉన్నాయి. ముడిసరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు కూడా పెరిగాయి.

– జస్సారాం, వినాయక విగ్రహాల తయారీదారుడు

ధరలు చాలా పెరిగాయి

వినాయక విగ్రహాల ధరలు గత ఏడాది కన్నా చాలా పెరిగాయి. గతంలో పదివేలకు కొనుగోలు చేసిన గణపతి ఈ ఏడాది రూ. 15వేలకు లభిస్తుంది. దీంతో చిన్న గణపతి కొనుగోలు చేయాలనుకుంటున్నాం.

– రమేష్, స్థానికుడు